క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని మహమ్మద్‌నగర్, బూర్గుల్, సింగితం, తెల్గాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల అసిస్టెంట్ అధికారి అంజయ్య తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఉన్న సదుపాయాలను తెలుసుకున్నారు. ఎన్నికల నాటికి అన్ని కేంద్రాల్లో కరెంట్ బల్బులు, ఫ్యాన్లను సిద్ధంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

తాడ్వాయిలో వాహనాలు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఎర్రాపహాడ్, కృష్ణాజీవాడి, దేవాయిపల్లి శివారులోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమాన విధించారు.

ఉచిత వైద్యశిబిరం



కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్‌లో నిజామాబాద్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పస్తం యాదమ్మ, వైద్యులు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్ పాఠశాలలో..

రాజంపేట: మండల కేంద్రంలోని శారద శిశు మందిర్ పాఠశాలలో మంగళవారం హోమియో వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు పద్మశ్రీ, సునీత, ప్రధానోపాధ్యాయులు పండరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

'వడ్డేపల్లి'కి శుభాకాంక్షలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి బీజేపీ టికెట్‌ను అధిష్టానం సుభాష్‌రెడ్డికి కేటాయించడంతో మంగళవారం ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిలో బీజేపీ జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. నాయకులు దేవేందర్, బాలకిషన్, సతీష్, రాజేష్, బాలరాజు తదితరులున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి: తెలంగాణ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు చేసిన అభివృద్ధి గురించి ప్రచురించిన కరపత్రాలను ఎమ్మెల్యే సురేందర్‌తో కలిసి మైనార్టీ నాయకులు ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ మైనార్టీలకు చేసిన అభివృద్ధి పనులు షాదీ ముబారక్, మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు అందించి మైనార్టీ వర్గాల వారిని ఆదుకున్నారని అన్నారు. నాయకులు ఇమ్రాన్, ముజీబ్ తదితరులున్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కొలతలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సెంట్రల్ లైటింగ్ శాంక్షన్ కావడంతో మంగళవారం అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్డు కొలతలు తీసుకున్నారు. రోడ్డు మధ్యలోంచి 50 ఫీట్ల దూరంలో రెండు వైపులా కొలతలు తీసుకున్నారు. సెంట్రల్ లైటింగ్ కోసం వంద ఫీట్ల వెడల్పు గల రోడ్డు వేయాల్సి ఉంటుందని, రోడ్డు పక్కన గల దుకాణదారులు సహకరిస్తే పనులు త్వరగా జరుగుతాయని పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు. రంగులతో మార్క్ వేశారు. త్వరలో రోడ్డు వెడల్పు పనులు మొదలవుతాయని వారు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థికి ఘనస్వాగతం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావుకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ సాధించుకొని ఢిల్లీ నుంచి హైద్రాబాద్‌కు వచ్చిన లక్ష్మీకాంతరావును జుక్కల్ నియోజవర్గం కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా స్వాగతం పలికాయి.

రైతులకు వరుణుడి బెంగ

- మబ్బులు పడుతున్న ఆకాశం
- కురుస్తున్న చిరుజల్లులు



నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెదగేట్ వద్ద ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు పెద్ద సమస్యగా మారింది. 15 రోజులుగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబోసుకున్న రైతులకు ఆకాశంలో పడుతున్న మబ్బులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆకస్మికంగా ఆకాశం మబ్బులు పట్టడంతో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పగా చేసి వర్షం నుంచి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ధాన్యం తూకం చేసి రైస్‌మిల్లుకు తరలించేవరకు రైతులకు కంటిమీద కునుకు పడడంలేదు.

జుక్కల్‌కు నేనే లోకల్

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



అచ్చంపేటలో మాట్లాడుతున్న హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): నాన్ లోకల్‌ోళ్ల మాటలు నమ్మవద్దని జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే అన్నారు. జుక్కల్ గడ్డపై పుట్టిన లోకల్ బిడ్డను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, ఆరేడ్, బ్రహ్మణపల్లి, వెల్గనూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం కొనసాగించారు. స్థానికులు సింధేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరవై ఏండ్లు పాలించిన పార్టీలు జుక్కల్‌ను వెనుకబాటుకు గురి చేశాయన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ పరిపాలనలో అభివృద్ధి పనులు చేశామన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలు వచ్చే ఐదేళ్లలో అమలు చేస్తామన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్‌రాజు, సర్పంచులు అనుసూయ, సంగవ్వ, బాలయ్య, రమేష్‌గౌడ్, ఎంపీటీసీలు సుజాత, దేవదాస్, జనార్దన్, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

శివాలయంలో పూజలు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వరాలయంలో మంగళవారం హన్మంత్ సింధే ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే వేదపండితుడు సంజీవ్‌రావ్ శర్మ ఆశీర్వాదం తీసుకున్నారు.

ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటా

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు



మదన్ మోహన్ సమక్షంలో చేరుతున్న నేతలు

నాగిరెడ్డిపేట/లింగంపేట/రామారెడ్డి/రాజంపేట: ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రభుత్వం తరపున నాకు వచ్చే జీతంలో ఒక్క రూపాయి మాత్రమే తీసుకొని మిగతా డబ్బులను నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తానని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం సర్పంచ్ విజిత, మాల్తుమ్మెద సర్పంచ్ ప్రతిభతో పాటు పలువురు, జలాల్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు, అలాగే లింగంపేట మండలంలోని ఒంటర్‌పల్లి, ముస్తాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, రాజంపేట మండలంలోని గుండారం, కొండాపూర్, ఆర్గొండ, కొండాపూర్, ఎల్లాపూర్ తండా, గుడితండా, శేర్‌శంకర్ తండా తదితర గ్రామాలలోని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తమ పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మదన్‌మోహన్‌రావు, కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పోచారం, మాల్తుమ్మెద గ్రామాలశివారుల్లో గల అసైన్‌మెంట్ భూములకు పట్టాలిప్పించడంతోపాటు నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తానని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచాక యువత ఉపాధి ఉద్యోగాల కోసం ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అన్నారు. ప్రజలు పైసలిచ్చి సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. నియోజకవర్గంలోని 80 చెక్ డ్యాముల నిర్మాణంలో ఎమ్మెల్యే సురేందర్ ఆంధ్రా కాంట్రాక్టర్ల వద్ద కమీషన్ తీసుకున్నాడని ఆరోపించారు. నేడు 8న ఎల్లారెడ్డిలో వేసే నామినేషన్‌కు కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. రామారెడ్డి మండలం పోసానిపేట సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి తన గెలుపు కోసం పని చేయాలని కృషి చేయాలని ఆయనను కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని లింగంపేట మండల నోడల్ అధికారి షౌకత్ అలీ సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన 2 రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని నాలుగు క్లస్టర్లలో సోమ, మంగళవారాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్, రవీందర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ హౌస్‌పై అవగాహన సదస్సు



రాజంపేట: బసవన్నపల్లి గ్రామంలో ఖేతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సుమారు 100 మంది రైతులకు గ్రీన్ హౌస్‌పైన అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రీన్ హౌస్ వల్ల కలిగే లాభాల గురించి సంస్థ జోనల్ మేనేజర్ విఠల్ తెలిపారు. గ్రీన్ హౌస్ వేసుకున్న తర్వాత దాంట్లో ఏమేం పంటలో పండించాలో అవగాహన కల్పించారు. రైతులు బయట పండించడం ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను అదేవిధంగా నెట్ హౌస్‌లో ఎలా పరిష్కారం చేసుకోవాలో వివరించారు. ఈ గ్రీన్ హౌస్‌ని రైతులకు ఖేతి సంస్థ 52 శాతం సబ్సిడీతో అందిస్తుందని పేర్కొన్నారు. సబ్సిడీ ద్వారా రూ.49,500లకు రైతులకు అందిస్తామన్నారు. సర్పంచ్ శ్రీజరమేష్ రెడ్డి, ఏవో సుప్రజ్యోతి, ఏఈవో శిల్ప, రైతులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువు

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: ప్రతిపక్ష పార్టీలకు బాన్సువాడలో అభ్యర్థులు లేక ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం బాన్సువాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తరపున నామినేషన్ దాఖలు చేసి విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏడు సార్లు ఎన్నికల్లో పోటీ చేస్తే ఆరు సార్లు విజయం సాధించారని, ఈ సారి కూడా బాన్సువాడలో భారీ మెజార్టీతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని అన్నారు. ప్రస్తుతం పూర్తి విశ్వాసంతో ప్రజలు ఉన్నారని, ఎప్పుడు ప్రజల మధ్య, ప్రజల కోసం నిరంతరం సేవ చేసే వ్యక్తినే ప్రజలు నమ్ముతున్నారని, రాష్ట్రంలో ఐదవ స్థానంలో ఉన్న బాన్సువాడను నంబర్ వన్ స్థానంలోకి తెచ్చేందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారని, రూ.10 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అలాగే 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించిన ఘనత పోచారంకే దక్కిందన్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలోనే పుట్టి పెరిగిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికే ప్రజల మద్దతు ఉందని అన్నారు. నాయకులు గురువినయ్, పాత బాలకృష్ణ, నాగులగామ వెంకన్న, ఎజా స్, నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

అవినీతి అంతమే బీజేపీ పంతం



ఉప్పర్‌పల్లిలో వెంకటరమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న గ్రామస్తులు

- కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి

బీబీపేట: అవినీతి అంతం బీజేపీ పంతమని కామారెడ్డి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఉప్పర్‌పల్లి, యాడారం గ్రామాల్లో పలువురు బీజేపీలో చేరారు. వారిని బీజేపీలోకి ఆహ్వానిస్తూ వెంకటరమణారెడ్డి పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నక్క రవీందర్, సంతోష్ గౌడ్, అల్లం ప్రవీణ్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, శివ, దేవరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



సుభాష్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న ప్రజలు

ఎల్లారెడ్డి: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్, మత్తమాల, సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట, నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరారు.

చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండి



బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని పోచారం సోదరుడు పోచారం శంభురెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీచర్స్‌కాలనీ, తాడ్కోల్ రోడ్డులో ఆయన ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత పోచారం శ్రీనివాస్ రెడ్డికే దక్కుతుందన్నార. ప్రజలకు మేలు చేసే వారిని మరువద్దని కోరారు. బీర్కూర్‌లో మాజీ జెడ్పీటీసీ సతీష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌కు బిచ్కుంద సర్పంచ్ రాజీనామా



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద సర్పంచ్ నూకల శ్రీరేఖ, నలుగురు వార్డు సభ్యులు, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ లతీఫ్ పాషా, సొసైటీ మాజీ వైస్ చైర్మన్, బంజారా నాయకుడు నౌషా నాయక్, తదితరులు మంగళవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ.. సమస్యల్ని ఎమ్మెల్యే హన్మంత్ సింధే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. పార్టీలో మాకు సముచిత స్థానం ఇవ్వలేదని, అవినీతి నేతల్ని దగ్గర పెట్టుకొని అన్యాయం చేశారని అన్నారు. కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

జీవో–60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



బాన్సువాడ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జీవో–60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడలోని ఏరియా ఆస్పత్రి సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశానికి ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్‌రాములుతో కలిసి హాజరై మాట్లాడారు. యజమాని, ప్రభుత్వం కలిసి కార్మికుల శ్రమదోపిడి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు దశరత్, బాలరాజ్, తదితరులున్నారు.

ఆర్థిక సాయం

బీబీపేట: మండలంలోని జనగామ గ్రామానికి చెందిన పాత సిద్దయ్య అనారోగ్యానికి గురవడంతో చికిత్స నిమిత్తం మంగళవారం తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనకు మెరుగైన చికిత్సను అందించాలని, మరింత ఆర్థిక సహాయం అందిస్తానని సుభాష్ రెడ్డి చెప్పారు. వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, అశోక్, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

నా భవిష్యత్ కార్యకర్తల చేతుల్లోనే..

- అధిష్టానం పునరాలోచించాలి
- కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాసుల

బాన్సువాడ: నా రాజకీయ భవిష్యత్ కార్యకర్తలు, ప్రజల చేతుల్లోనే ఉందని కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం బాన్సువాడలోని తన నివాసంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితిలో ఉన్నప్పటి నుంచి అన్నీ తానై 2014 నుంచి పార్టీని నమ్ముకుని, కార్యకర్తలను కాపాడుకుంటూ, ప్రజ సమస్యలపై నిరంతరం పోరాటం చేశానని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం టికెట్ విషయంలో మరోమారు ఆలోచించాలని, లేని పక్షంలో బాన్సువాడలో నిరాహార దీక్ష చేయడానికి సిద్ధమవుతామని అన్నారు. గతంలో ఇతర ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే కార్యకర్తలను, నాయకులకు, ప్రజలను మోసం చేసి వెళ్లారని, ప్రస్తుతం మరో మారు అదే తప్పు జరగకుండా అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు. నాయకులు మంత్రి గణేష్, అజీం, అలిబిన్ అబ్దుల్లా, అసద్, నార్ల రఘు, నగేష్, పర్వారెడ్డి, తదితరులున్నారు.

షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కామారెడ్డి టౌన్: బీజేపీ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రోతావన్ మోహన్‌నాయక్ మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. కామారెడ్డిలో పోటీ చేస్తున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని షబ్బీర్ అలీ కోరారు. డీసీసీ అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, తదితరులున్నారు.

భిక్కనూరులో ..

భిక్కనూరు: మండల కేంద్రంలోని కొత్తపేటకు చెందిన 78 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. వీరికి కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డిలు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. నేతలు అందే దయాకర్‌రెడ్డి, సిద్ధాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాల, వశిష్ఠ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటరు అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని వక్తలు కోరారు. సాందీపని కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, అకాడమిక్ ఇన్‌చార్జి మనోజ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్, తదితరులున్నారు.

స్వార్థం లేని నాయకుడ్ని ఎన్నుకోవాలి

కామారెడ్డి అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక వజ్రాయుధమని దాన్ని ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ ప్రోగ్రాం –2023(స్వీప్) కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో ఓటు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఓటు ప్రాముఖ్యతపై ఇప్పటికే వ్యాసరచన, ఉపన్యాసాలు, పాటలు, కవితలు, నాటికలు, 2కే రన్, కొత్త ఓటర్ల నమోదు వంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, స్వీప్ సమన్వయకర్త, ఎన్‌సీసీ అధికారి ఎం.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎన్నికల నియమావళి, నిర్వహణ తీరుపై మాల్తుమ్మెద హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మాక్‌పోలింగ్ చేపట్టారు. దీంతోపాటు ఎన్నికల నియమావళి, నిజాయితీగా ఓటుహక్కును వినియోగించుకోవడం, కౌంటింగ్ ప్రక్రియ తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు 'ఓట్ ఫర్ ష్యూర్' అనే సంకేతంతో విద్యార్థులు కూర్చున్నారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులతో పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోండి

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో పదవ తరగతి విద్యార్థుల నుంచి యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని, యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కామారెడ్డి ఎస్ఎఫ్ఎస్ ప్రెసిడెంట్ గంధం సంజయ్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వీరు ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం కళాశాల అధ్యక్షుడు మధు, ప్రతినిధులు సాయికుమార్, సుప్రియ, శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించాలి

కామారెడ్డి టౌన్: మానవ అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించాలని మానవ అక్రమ రవాణా నిర్వహణ విభాగం సభ్యుడు పి.రాజేందర్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(గంజ్)లో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే తక్షణమే షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో షీం టీమ్ సభ్యులు భూమయ్య, సౌజన్య, సాధన ఎన్జీవోస్ కౌన్సిలర్‌లు సంగీత, రవళి, హెచ్ఎం హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం..

రేపు బాన్సువాడలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బాన్సువాడ: పట్టణంలోని పవర్ హౌస్ కాంపౌండ్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీజీఆర్ఆర్ చైర్మన్ ఈశ్వరయ్య, టెక్నికల్ సభ్యులు రామకృష్ణ హాజరు కానున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ బోధించటానికి ఆసక్తి గల వారు పీజీలో 55 శాతం మార్కులు ఉండి, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మున్నూరుకాపు ప్రతిభా పురస్కారాలకు..

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు వజ్రోత్సవాల సందర్భంగా 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి నుంచి పీజీ స్థాయి వరకు 80 శాతం పైగా మార్కులు పొందిన ప్రతిభావంతులైన మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను ఈనెల 30లోపు కాచిగూడలోని విద్యార్థి వసతి గృహం కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 040–24657404, 9491627404 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.